# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ వసతి గృహాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **తెలంగాణ - ఈశాన్య రాష్ట్రాలు పరస్పర సహకారంతో అభివృద్ధిలో ముందుకు సాగాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లోని గ్రామ సచివాలయాల వ్యవస్థపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు.**

4. **తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని వెల్లడించారు.**

5. **భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వసతి గృహాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో నీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ వసతి గృహాల్లో నీటి శుద్ధి ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లల్లో మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలను నిర్వహించాలని ఆదేశించారు.

------------------------

తెలంగాణ - ఈశాన్య రాష్ట్రాలు పరస్పర సహకారంతో అభివృద్ధిలో ముందుకు సాగాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు. 'తెలంగాణ- నార్త్ ఈస్ట్ కనెక్ట్' టెక్నో-కల్చరల్ ఫెస్టివల్ రెండో దశను హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిన్న సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, 'తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్' కేవలం సాంస్కృతిక మార్పిడి మాత్రమే కాదని వికసిత భారత్ లక్ష్యానికి దోహదంచేస్తుందన్నారు. ప్రాంతాలు అభివృద్ధి చెందటానికి యువతకు అవకాశాలు సృష్టించడానికి ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయని చెప్పారు.

------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గ్రామ సచివాలయాల వ్యవస్థ నిర్మాణం, పని తీరు పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. గ్రామ స్థాయిలో సచివాలయం ఉద్యోగులను ఆయా శాఖలకు అనుసంధానం చేసే అంశంపై గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, సచివాలయ సిబ్బందికి పదోన్నతుల కల్పన, ఇతర శాఖలతో అనుసంధానించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. పదోన్నతులు కల్పించినప్పటికీ సచివాలయ వ్యవస్థకు ఇబ్బందులు కలగకుండా ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే అంశాలపై అధ్యయనం చేసి మార్చి నెల నాటికి నివేదిక ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

భారత పత్తి సమాఖ్య – సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించే రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా పేరేచెర్ల, సత్తెనపల్లిలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రి నిన్న సందర్శించారు. పత్తి తేమ శాతం నమోదుతో పాటు, కొనుగోలు విధానం, యాప్ లో నమోదు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ,

వాయిస్ .. 27 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన కార్మిక చట్టాలు చారిత్రాత్మక సంస్కరణలని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి అన్నారు. విజయవాడలో మంత్రి నిన్న మాట్లాడుతూ, ఈ చట్టాల ద్వారా నిర్ణీతకాల ఉద్యోగులకు సామాజిక భద్రత, శాశ్వత ఉద్యోగులతో సమాన ప్రయోజనాలు వంటివి లభిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టాలని రాష్ట్ర ప్రభుత్వం స్వాగతిస్తుందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

గోవాలో జరుగుతున్న 56 వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం– ఇఫీలో ఈరోజు విభిన్న శ్రేణి చలనచిత్ర ప్రదర్శనలతో పాటు సినిమా నిపుణులతో మాస్టర్‌క్లాస్‌లను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఇండియన్ పనోరమా విభాగంలో తెలుగు చిత్రం "కమిటీ కుర్రోళ్లు"తో పాటు గోంధాల్, భైమోన్ డా, వైట్ స్నో, పత్రలేఖ, ఇంబు వంటి చిత్రాలను ప్రదర్శిస్తారు. ఉరుమి, సంజు, డంకీ తదితర చిత్రాలకు దుస్తులు రూపొందించిన కాస్ట్యూమ్స్ డిజైనర్ ఎకా లఖానీ "కాస్ట్యూమ్ అండ్ క్యారెక్టర్ ఆర్క్: ది ట్రెండ్‌సెట్టర్స్ ఆఫ్ సినిమా" అంశంపై మాస్టర్ క్లాస్ నిర్వహిస్తారు.

---------------------------

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో డిసెంబరు 11, 14, 17 తేదీల్లో నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎన్నికల సంఘం

కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ ను ఆమె నిన్న విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూలు, నిర్వహణ ప్రక్రియ వివరాలను పాత్రికేయులకు ఈ సందర్భంగా వెల్లడిస్తూ..

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. రాజ్యాంగాన్ని 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల వ్యవధిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సారథ్యంలోని కమిటీ పూర్తి స్థాయి రాజ్యాంగాన్ని రూపొందించింది. 1949 నవంబర్ 26వ తేదీన అప్పటి రాజ్యాంగ అసెంబ్లీ దీనిని ఆమోదించింది. రాజ్యాంగ దినోత్సవాన్ని సంవిధాన్ దివస్ అని కూడా పిలుస్తారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభనుద్దేశించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన ప్రసంగం ఒకసారి విందాం..

...వాయిస్ 24 సెకన్లు

-------------------------

భారత రాజ్యాంగ దినోత్సవం –2025 ను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో "పాఠశాల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు నిర్వహించనుంది. అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో ఈరోజు ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్, రాష్ట్ర శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు, మంత్రి నారా లోకేష్ పాల్గొంటారని అధికారులు తెలిపారు.

-------------------------

మలక్కా జలసంధి సమీపంలో గుర్తించిన అల్పపీడనం వాయుగుండంగా మారిందని, ఇది పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ పేర్కొన్నారు.

=====================